PRGI NO: TGTEL/26/A0383

డైనమిక్

# జనం వాయిస్

తెలుగు దినపత్రిక

DYNAMIC JANAMVOICE

WWW.JANAMVOICE.COM

తెలంగాణ   శుక్రవారం   02-10-2026   సంపుటి: 01   సంచిక : 264   పేజీలు : 12

## శభాష్ మచ్చార్..
## నీ ధైర్యానికి సలాం!





2 లో

ప్రాణాలకు తెగించి 174 మందిని

కాపాడిన భారత పైలట్.

కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు ప్రధాని మోదీ

ప్రశంసలు.. 'హీరో'గా అభివర్ణన.

**జనం వాయిస్, న్యూఢిల్లీ, అక్టోబరు 1:**

గాల్లోనే పెను ప్రమాదం.. కాక్‌పిట్‌లో సహ పైలట్ కత్తితో దాడి.. తీవ్రంగా గాయపడినా ప్రాణాలను లెక్కచేయకుండా ప్రయాణికుల రక్షణ కోసం పోరాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్1073 విమానంలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో 174 మంది ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు.

గాంధీ జయంతి నుంచి వారం పాటు

## ఉద్యమం

'సేవ్ డెమోక్రసీ' పేరుతో దేశవ్యాప్త నిరసనలు.

అక్టోబర్ 6న ఈసీ కార్యాలయానికి విపక్ష ఎంపీల ర్యాలీ.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్.




**జనం వాయిస్, న్యూఢిల్లీ, అక్టోబరు 1:**

ఎన్నికల ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తదితర విపక్ష నేతలు ఢిల్లీలో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు జిల్లా స్థాయిలో 'సేవ్ డెమోక్రసీ' పేరుతో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల జాబితాల సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న విపక్షాలు.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అక్టోబర్ 2 నుంచి వారం రోజుల పాటు జిల్లా కేంద్రాల్లో నిరసనలు, ధర్నాలు నిర్వహించడంతో పాటు ప్రజాసంఘాలు, యువతను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని - మిగతా 2 లో...




2

## ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి.

హైకోర్టుకు విజయారెడ్డి.. విచారణ వాయిదా

ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్‌పై హైకోర్టులో విచారణ. నోటిఫికేషన్ నిలిపివేయాలని కోరుతూ విజయారెడ్డి పిటిషన్. దానం నాగేందర్ ఎన్నికపై వేసిన పాత పిటిషన్ పెండింగ్‌లో ఉందని వాదన. విచారణను మంగళవారానికి వాయిదా వేసిన న్యాయస్థానం. కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశం.



## దేవుళ్ల మధ్య చిచ్చు

రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు. శివుడు, రాముడిపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం. దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగడంపై కిషన్ రెడ్డి అభ్యంతరం. ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపణ.

2

## పదోసారి ఎన్నికల బరిలో దానం!

ఖైరతాబాద్‌కు ఉపఎన్నిక ఖాయం.

మళ్లీ పోటీకి సిద్ధమంటున్న మాజీ ఎమ్మెల్యే.



12

## మా ఆస్తులు.. మీ ఆస్తులు..
## విచారణకు సిద్ధమా?

**సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!**

రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్.

రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్.

తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్.

ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్.





**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 1:**

తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన - మిగతా 2 లో...

## తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు.

2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి ఆమోదం.

డీఏల పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ. 2,500 కోట్ల అదనపు భారం.






12

## అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం: సీఎం చంద్రబాబు

అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా మార్చేందుకు పెట్టుబడులు

ప్రపంచ కాఫీ పటంలో ఏపీకి సరైన స్థానం కల్పిస్తామన్న చంద్రబాబు.

గిరిజనుల శ్రమ, తూర్పు కనుమల సౌరభం అరకు కాఫీ అన్న పవన్ కల్యాణ్.

## ఫ్లైదుబాయ్ విమానంలో అసలేం జరిగింది?

ప్లంబర్ ను నెతన్యాహు ఎందుకు అభినందించారు?

దుబాయ్-టెల్ అవీవ్ విమానంలో పైలట్‌పై దాడి చేసి విమానాన్ని కూల్చేసే కుట్ర.

ప్రాణాలకు తెగించి కాక్‌పిట్ డోర్ తెరిచిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్.

కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లి దాడిని అడ్డుకుని విమానాన్ని కాపాడిన ఇజ్రాయెలీ ప్లంబర్.

"పెద్ద అడ్డంకి తొలగించావ్" అంటూ ప్రయాణికుడిని మెచ్చుకున్న ప్రధాని నెతన్యాహు.

సౌదీ అరేబియాలో విమానం సురక్షిత ల్యాండింగ్.

12



**జనం వాయిస్, న్యూఢిల్లీ, అక్టోబరు 1:**

దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఓ పెను ప్రమాదం తృటిలో తప్పింది. మరో 9/11 తరహా విధ్వంసాన్ని తలపించే కుట్రను ఓ ప్రయాణికుడి సాహసం, పైలట్ అసాధారణ ధైర్యం భగ్నం చేశాయి. విమానాన్ని కాపాడి హీరోగా నిలిచిన ఇజ్రాయెలీ ప్లంబర్‌ను ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన చమత్కారభరిత వ్యాఖ్య అందరినీ ఆకట్టుకుంది.

- మిగతా 2 లో...

# మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

- మొదటి పేజీ తరువాయి..

ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

# ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి.

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 1:**

ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. దివంగత మాజీ మంత్రి పి. జనార్దన్ రెడ్డి కుమార్తె విజయారెడ్డి ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 2024 ఎన్నికల్లో దానం నాగేందర్ విజయాన్ని సవాల్ చేస్తూ తమ క్లయింట్ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్ ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. ఆ ఎన్నికల అఫిడవిట్‌లో దానం నాగేందర్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ పాత పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. వాదనలు విన్న హైకోర్టు, ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తాజా నిర్ణయంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రక్రియపై ప్రస్తుతానికి ఉత్కంఠ నెలకొంది.

# దేవుళ్ల మధ్య చిచ్చు

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 1:**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

# తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 1:**

దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు సమావేశమైన కేబినెట్ సానుకూల నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను వారు ఈ సందర్భంగా వివరించారు. రెండు డీఏల వల్ల ప్రభుత్వంపై సుమారు రూ. 2,500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగినట్లు మంత్రులు పేర్కొన్నారు. నిన్న ఒక్కరోజే 19,892 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు వారు వెల్లడించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం నిన్నటితో వర్షాకాలం ముగిసిందని, ఈ ఏడాది సగటున 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఎల్ నినో ప్రభావంపై కేబినెట్ అత్యవసర నివేదికను సిద్ధం చేస్తోందని మంత్రులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా 5,800 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రులు వెల్లడించారు. వీటితో పాటు 'తెలంగాణ డిజిటల్ మీడియా అండ్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ'కి కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వారు పేర్కొన్నారు.



# శభాష్ మచ్చార్.. నీ ధైర్యానికి సలాం!

**జనం వాయిస్, న్యూఢిల్లీ, అక్టోబరు 1:**



గాల్లోనే పెను ప్రమాదం.. కాక్‌పిట్‌లో సహ పైలట్ కత్తితో దాడి.. తీవ్రంగా గాయపడినా ప్రాణాలను లెక్కచేయకుండా ప్రయాణికుల రక్షణ కోసం పోరాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్1073 విమానంలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో 174 మంది ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. విమానం సౌదీ అరేబియా గగనతలంలో ప్రయాణిస్తున్న సమయంలో కాక్‌పిట్‌లో ఉన్న సహ పైలట్ కెప్టెన్ మచ్చార్‌పై కత్తితో దాడి చేసినట్లు అధికారులు, అంతర్జాతీయ మీడియా నివేదికలు పేర్కొన్నాయి. దాడిలో తీవ్రంగా గాయపడిన మచ్చార్ పరిస్థితిని అర్థం చేసుకుని కాక్‌పిట్ తలుపును తెరవగలిగారు. దీంతో ప్రయాణికులు, సిబ్బంది అప్రమత్తమై దాడి చేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో విమానం తీవ్రంగా ఎత్తు కోల్పోయింది. దాదాపు 14 వేల అడుగుల మేర విమానం వేగంగా కిందికి దిగినట్లు విమాన డేటా వెల్లడించింది.

### మచ్చార్ తెగువ.. తప్పిన పెను ప్రమాదం

కాక్‌పిట్‌లో జరిగిన ఘర్షణ అనంతరం ప్రయాణికులు, సిబ్బంది కలిసి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విమానంలో ఉన్న మరో ఇద్దరు ఫ్లైదుబాయ్ పైలట్లు పరిస్థితిని చక్కదిద్ది విమానాన్ని సౌదీ అరేబియాలోని టబుక్ విమానాశ్రయంలో అత్యవసరంగా దించారు. అనంతరం ప్రయాణికులను మరో విమానం ద్వారా వారి గమ్యస్థానానికి తరలించారు. కెప్టెన్ మచ్చార్‌కు ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఆయన పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### 'మచ్చార్ నిజమైన హీరో'.. మోదీ

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. కెప్టెన్ స్మిత్ మచ్చార్‌ను లి'హీరో'లిగా అభివర్ణిస్తూ ఆయన చూపిన ధైర్యాన్ని ప్రశంసించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన ప్రదర్శించిన ధైర్యం, అచంచల సంకల్పం గొప్పవని పేర్కొన్నారు. ఆయన శౌర్యం వందలాది ప్రాణాలను కాపాడి, పెను విషాదాన్ని నివారించడంలో కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. మచ్చార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తరువాత యూపీఎస్సీ శతాబ్ది వేడుకల్లోనూ మోదీ మచ్చార్ ధైర్యాన్ని ప్రస్తావించారు. తన ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడి 9/11 తరహా పెను విషాదాన్ని నివారించారని పేర్కొన్నారు. మచ్చార్‌కు 140 కోట్ల మంది భారతీయులు సెల్యూట్ చేస్తున్నారని అన్నారు.

### అంతర్జాతీయ ప్రశంసలు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా కెప్టెన్ మచ్చార్‌ను అభినందించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ప్రతిఘటించి కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు, సిబ్బంది దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో మచ్చార్ చర్యలు పెను గగనతల విషాదాన్ని నివారించడంలో కీలకంగా నిలిచాయని నెతన్యాహు ప్రశంసించారు. కెప్టెన్ మచ్చార్ ముంబైకి చెందిన భారతీయుడు. ఫ్లైదుబాయ్‌లో చేరకముందు స్పైస్‌జెట్‌లో పనిచేసిన ఆయనకు విమానయాన రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై సౌదీ, ఇజ్రాయెల్, యూఏఈ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దాడికి గల కారణాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు.

# గాంధీ జయంతి నుంచి వారం పాటు ఉద్యమం

**జనం వాయిస్, న్యూఢిల్లీ, అక్టోబరు 1:**

ఎన్నికల ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తదితర విపక్ష నేతలు ఢిల్లీలో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు జిల్లా స్థాయిలో 'సేవ్ డెమోక్రసీ' పేరుతో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల జాబితాల సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న విపక్షాలు.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అక్టోబర్ 2 నుంచి వారం రోజుల పాటు జిల్లా కేంద్రాల్లో నిరసనలు, ధర్నాలు నిర్వహించడంతో పాటు ప్రజాసంఘాలు, యువతను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని కూటమి నిర్ణయించింది.

### 6న ఈసీ కార్యాలయానికి ర్యాలీ

ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 6న దేశంలోని ప్రతిపక్ష పార్టీల ఎంపీలంతా ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లనున్నట్లు ఖర్గే ప్రకటించారు. అనంతరం అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగ సంస్థల పనితీరుపై తమ అభ్యంతరాలను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

### ఐదు భారీ సభలు

ఎస్ఐఆర్‌తో పాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన విచారించాలని ఇండియా కూటమి కోరనుంది. అక్టోబర్, నవంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా ఐదు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఖర్గే తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీలో భారీ సభ నిర్వహించే ప్రణాళిక కూడా ప్రకటించారు.

### 'ప్రజాస్వామ్యాన్ని కాపాడతాం' : రాహుల్

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా పోరాడతాయని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై తాము లేవనెత్తుతున్న ప్రశ్నలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం ఏ ఒక్క వ్యక్తికంటే గొప్పదని, రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

### ఆందోళన ఉధృతం చేస్తాం : మమత

ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై మమతా బెనర్జీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, డిమాండ్ నెరవేరకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐఆర్ అమలు, ఓటర్ల జాబితాల్లో మార్పులు, ఫామ్-6కు సంబంధించిన నిర్ణయాలు, ఎన్నికల డేటా కేంద్రీకరణ వంటి అంశాలపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని విపక్ష నేతలు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం మాత్రం తన నిర్ణయాలు చట్టపరమైన విధానాలకు అనుగుణంగానే ఉన్నాయని, సంస్థలో అధికారుల మధ్య అభిప్రాయ భేదాలు ఉండటం సాధారణ ప్రక్రియలో భాగమేనని పేర్కొన్నట్లు వార్తా నివేదికలు తెలిపాయి.

# పదోసారి ఎన్నికల బరిలో దానం!

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 1:**

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నికకు రంగం సిద్ధమైంది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అధికారికంగా ప్రకటించారు. హైకోర్టు తీర్పు ప్రకారం దానం నాగేందర్ అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచే అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్, ఆర్టికల్ 191(2) ప్రకారం ఆయనను శాసనసభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటిస్తూ స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు రద్దు చేసింది. అనంతరం దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో ఖైరతాబాద్ స్థానానికి ఉపఎన్నిక జరిగే పరిస్థితి ఏర్పడింది.

### మళ్లీ నేనే బరిలో!

అనర్హత వేటు నేపథ్యంలోనూ దానం నాగేందర్ రాజకీయంగా వెనక్కి తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఖైరతాబాద్‌కు ఉపఎన్నిక వస్తే తానే పోటీ చేస్తానని ఆయన గతంలో ప్రకటించారు. అదే జరిగితే శాసనసభ ఎన్నికల బరిలో ఆయన పోటీ చేయడం పదోసారి కానుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం నాగేందర్, 2024 మార్చిలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆయనపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి.

### బీఆర్ఎస్, బీజేపీకి ఊరట

దానం నాగేందర్‌పై అనర్హత వేటు నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు స్పందించారు. పార్టీ ఫిరాయింపులపై తమ పోరాటానికి ఇది ఫలితమని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ప్రజా తీర్పును, రాజ్యాంగ నిబంధనలను గౌరవించాల్సిన అవసరం ఉందని బీజేపీ నేతలు వ్యాఖ్యానించారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ వాటిని తిరస్కరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని రద్దు చేసి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది.

### ఉపఎన్నికకు తెరలేచినట్టే

ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటిస్తూ అసెంబ్లీ కార్యదర్శి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నికలో దానం నాగేందర్ మళ్లీ పోటీ చేస్తారా? కాంగ్రెస్ ఆయనకే అవకాశం ఇస్తుందా? లేక కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపుతుందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం: సీఎం చంద్రబాబు



**జనం వాయిస్,ఆంధ్రప్రదేశ్, అక్టోబరు 1:**

అరకును ప్రపంచ స్థాయి కాఫీ కేంద్రంగా (ప్రీమియర్ గ్లోబల్ కాఫీ డెస్టినేషన్) తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రియాశీలకంగా పెట్టుబడులు పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉదయం ఒక కప్పు కాఫీ తాగనిదే కోట్లాది మందికి రోజు ప్రారంభం కాదని, తన దినచర్య కూడా అరకు కాఫీతోనే మొదలవుతుందని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా తెలిపారు. "అరకు.. ఆంధ్రప్రదేశ్ ఘనమైన వారసత్వ సంపదకు ప్రతీక. మన రాష్ట్రంలోని కొండ ప్రాంతాల నుంచి ప్రపంచవ్యాప్తంగా కాఫీ కప్పుల వరకు అరకు కాఫీ సాగించిన అద్భుత ప్రయాణాన్ని ఈ అంతర్జాతీయ కాఫీ దినోత్సవం రోజున జరుపుకుందాం" అని ఆయన పేర్కొన్నారు. స్థానిక రైతులను ప్రోత్సహిస్తూ, ప్రపంచ కాఫీ పటంలో ఆంధ్రప్రదేశ్‌కు సరైన స్థానం కల్పించడమే తమ లక్ష్యమని చంద్రబాబు వివరించారు. ఇదే సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అంతర్జాతీయ కాఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అరకు కాఫీ విశిష్టతను వివరిస్తూ, "ప్రతి కప్పు అరకు కాఫీలో తూర్పు కనుమల సౌరభం, అక్కడి నేల సారం, మన గిరిజన రైతుల కఠోర శ్రమ ఇమిడి ఉన్నాయి" అని అన్నారు. అరకు కాఫీ కేవలం రుచి, సువాసనలకు మాత్రమే పరిమితం కాదని, అది మన అడవులు, గిరిజన సంఘాలు, వారి సంప్రదాయ జ్ఞానం మధ్య ఉన్న బంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్న ఈ స్థానిక ఉత్పత్తి, అరకు లోయల నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ వరకు ప్రయాణించిందని, అక్కడ ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించబడిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా అరకు కాఫీని, దాని సాగుతో ముడిపడి ఉన్న గిరిజన కుటుంబాల కృషిని పలుమార్లు ప్రశంసించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ఒక కప్పు అరకు కాఫీ అంటే మన నేల రుచి, మన ప్రజల కథ, మన తూర్పు కనుమల సువాసన" అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. మొత్తంగా, అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర నాయకత్వం అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించింది.

# ఫ్లైదుబాయ్ విమానంలో అసలేం జరిగింది?

**జనం వాయిస్, న్యూఢిల్లీ, అక్టోబరు 1:**

దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఓ పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. మరో 9/11 తరహా విధ్వంసాన్ని తలపించే కుట్రను ఓ ప్రయాణికుడి సాహసం, పైలట్ అసాధారణ ధైర్యం భగ్నం చేశాయి. విమానాన్ని కాపాడి హీరోగా నిలిచిన ఇజ్రాయెలీ ప్లంబర్‌ను ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన చమత్కారభరిత వ్యాఖ్య అందరినీ ఆకట్టుకుంది.

### అసలేం జరిగిందంటే..

ఫ్లైదుబాయ్‌కు చెందిన ఫ్జీ1073 విమానం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరింది. విమానం గాల్లో ఉండగా, ఒమాన్‌కు చెందిన సహ పైలట్ అకస్మాత్తుగా భారతీయ పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. అనంతరం విమానాన్ని నియంత్రణలోకి తీసుకుని, దాన్ని అత్యంత వేగంగా కిందకు డైవ్ చేయించాడు. తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ, కెప్టెన్ మచ్చర్ ధైర్యం కోల్పోకుండా కాక్‌పిట్ డోర్‌ను తెరిచి సహాయం కోసం గట్టిగా అరిచారు.

### రంగంలోకి దిగిన ప్లంబర్

విమానం ఒక్కసారిగా కిందకు పడిపోవడం, కాక్‌పిట్ నుంచి అరుపులు వినపడటంతో యానివ్ హయున్ అనే ఇజ్రేలీ ప్రయాణికుడు అప్రమత్తమయ్యాడు. వెంటనే కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లి, దాడికి పాల్పడుతున్న సహ పైలట్‌ను వెనక్కి లాగేశాడు. అనంతరం విమానం కంట్రోల్స్‌ను పైకి లాగి దాన్ని స్థిరీకరించాడు. తాను చూసిన 'ఎయిర్ క్రాష్ ఇన్వెస్టిగేషన్' అనే టీవీ సిరీస్ ద్వారా విమాన నియంత్రణలపై తనకు కొంత అవగాహన ఉందని హయున్ తర్వాత చెప్పడం విశేషం. హయున్‌తో పాటు ఇతర ప్రయాణికులు, విమానంలో ఉన్న ఆఫ్-డ్యూటీ పైలట్ల సహాయంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం విమానాన్ని సమీపంలోని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు.

### "పెద్ద అడ్డంకి తొలగించారు"

ఈ ఘటన అనంతరం ఇజ్రేల్ చేరుకున్న యానివ్ హయున్‌ను ప్రధాని నెతన్యాహు బెన్ గురియన్ విమానాశ్రయంలో వ్యక్తిగతంగా కలుసుకున్నారు. ఆ సమయంలో హయున్ దుస్తులపై ఇంకా రక్తపు మరకలు ఉన్నాయి. ఆయనను అభినందించిన నెతన్యాహు, "మీరు జీవనోపాధి కోసం ఏం చేస్తుంటారు?" అని అడిగారు. అందుకు హయున్, "నేను ప్లంబర్‌ను, డ్రైనేజీల్లో పేరుకుపోయిన అడ్డంకులను తొలగిస్తాను" అని బదులిచ్చారు. దానికి నెతన్యాహు నవ్వుతూ, "ఈసారి మీరు నిజంగానే చాలా పెద్ద అడ్డంకిని తొలగించారు" అని చమత్కరించి ప్రశంసించారు. ఈ ఘటనపై ఇజ్రేల్ దర్యాప్తులో పాలుపంచుకుంటుందని, దీని వెనుక ఇరాన్ హస్తం ఉందేమోనన్న కోణంలోనూ విచారిస్తామని నెతన్యాహు తెలిపారు. అంతేకాకుండా, హయున్ ప్లంబింగ్ వ్యాపారాన్ని తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ప్రమోట్ చేస్తూ ఆయన ధైర్యాన్ని కొనియాడారు. కెప్టెన్ స్మిత్ మచ్చర్, ప్రయాణికుడు యానివ్ హయున్ ధైర్యసాహసాల వల్లే వందలాది మంది ప్రాణాలతో బయటపడ్డారని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పనుల్లో జాప్యం సహించేది లేదు..!

- ఆరు నెలల్లో అంతర్గాం తహసీల్దార్ కార్యాలయం పూర్తి చేయాలి.
- భూ రీసర్వే నవంబర్ 10లోగా పూర్తి.. రైతులకు ముందస్తు సమాచారం తప్పనిసరి.
- అంతర్గాం, ఆకెనపల్లి, రామగుండంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మిక తనిఖీలు.

**జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 1:**

జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గురువారం అంతర్గాం మండలంలో నిర్మాణంలో ఉన్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం, ఆకెనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియ, రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

### ఆరు నెలల్లో భవనం పూర్తి చేయాలి

అంతర్గాం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ



పనుల్లో వేగం పెంచి ఆరు నెలల్లోగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఏఈని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత గడువులోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### రైతులకు ముందే సమాచారం ఇవ్వాలి

ఆకెనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేకు ముందే సంబంధిత రైతులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా సర్వే నంబర్ల రైతులు సర్వే సమయంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. నవంబర్ 10లోగా భూ రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైతే అదనపు సర్వేయర్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా, పకడ్బందీగా రీసర్వే నిర్వహించాలని ఆదేశించారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా



తనిఖీ చేసిన కలెక్టర్ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారం-6 ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. కార్యాలయంలోని రికార్డులు, వివిధ ప్రక్రియల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయంలోగా వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

### క్షేత్రస్థాయిలోనే సమస్యలకు చెక్

అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో నాణ్యతతో అమలు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులు, భూ రీసర్వే, కార్యాలయ పరిపాలనా ప్రక్రియలపై స్వయంగా పరిశీలన చేయడం ద్వారా అధికారుల పనితీరును సమీక్షించారు. ఈ పర్యటనలో ఏడీ సర్వేయర్ సోమేశ్వర్, అంతర్గాం తహసీల్దార్ పడాల ప్రసాద్‌రావు, రామగుండం తహసీల్దార్ రవీందర్‌రావు, అంతర్గాం మండల సర్వేయర్ లలిత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల విషయంలో నిర్లక్ష్యం వద్దు.. తక్షణమే స్పందించాలి : డీసీపీ రామ్‌రెడ్డి

- పోలీస్ స్టేషన్‌కు వచ్చే సీనియర్ సిటిజన్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.
- సమస్యలను సత్వరం పరిష్కరించాలి.. ఇబ్బంది ఉంటే 112కు ఫోన్ చేయండి.
- పిల్లల పేరున ఉన్న భూములను తల్లిదండ్రుల పేరున మార్చిన ఘటనలు పెద్దపల్లిలోనే.
- రెండు కేసుల్లో రిజిస్ట్రేషన్లు రద్దు చేసి వృద్ధుల పేరున భూములు.
- ఆదరణ లేని వృద్ధులను ప్రభుత్వ వృద్ధాశ్రమానికి తరలించాలి.



**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 1:**

వృద్ధుల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, పోలీస్ స్టేషన్లకు వచ్చే సీనియర్ సిటిజన్లకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డీసీపీ రామ్‌రెడ్డి ఆదేశించారు. వృద్ధులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోయిర్కర్‌తో కలిసి




డీసీపీ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్‌కు వస్తే ప్రత్యేక ప్రాధాన్యత

ఈ సందర్భంగా డీసీపీ రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు ఏదైనా సమస్యపై పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారిని ఎక్కువసేపు వేచి ఉంచకుండా అత్యంత ప్రాధాన్యతతో వారి సమస్యను స్వీకరించి పరిష్కరించేలా పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. వృద్ధుల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే 112కు లేదా నేరుగా తనకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని డీసీపీ తెలిపారు. వృద్ధుల సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే వాటిపై సానుకూలంగా స్పందించి సకాలంలో పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### వృద్ధుల భూములకు రక్షణ

సీనియర్ సిటిజన్స్ చట్టం ద్వారా పిల్లల పేరున రిజిస్ట్రేషన్ చేసిన భూములను రద్దు చేసి తిరిగి వృద్ధ తల్లిదండ్రుల పేరున నమోదు చేసిన సందర్భాలు పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకున్నాయని డీసీపీ రామ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రెండు సందర్భాల్లో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో పిల్లల పేరున ఉన్న భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, తిరిగి వృద్ధ తల్లిదండ్రుల పేరున నమోదు చేసినట్లు వెల్లడించారు. వృద్ధుల హక్కులు, సంక్షేమం పట్ల జిల్లా యంత్రాంగం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఇది నిదర్శనమన్నారు.

### తల్లిదండ్రులను గౌరవించే కుటుంబాలే ఆదర్శం

వృద్ధులను గౌరవించే కుటుంబాలు మంచి ఫలితాలను పొందుతాయని డీసీపీ అన్నారు. తల్లిదండ్రులను ప్రేమగా, గౌరవంగా చూసే విధానం పిల్లలపై కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు. కుటుంబంలో తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల గౌరవం, ఆప్యాయతతో కూడిన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

### ఆదరణ లేని వృద్ధులకు ఆశ్రమం

బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు తదితర ప్రాంతాల్లో అనాథలు లేదా ఆదరణ లేకుండా కనిపించే వృద్ధులను గుర్తించి వారికి రక్షణ కల్పించాలని డీసీపీ సూచించారు. సుల్తానాబాద్‌లో ప్రభుత్వ వృద్ధాశ్రమం అందుబాటులో ఉందని తెలిపారు. ఆదరణ లేని వృద్ధులను గుర్తించిన వెంటనే ప్రభుత్వ వృద్ధాశ్రమానికి తరలించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధులు తమ సమస్యలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

### వయోవృద్ధులకు ఘన సన్మానం

అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పలువురు వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్ కృష్ణమూర్తి, డీఆర్‌డీఏ కాళిందిని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై.పవిత్ర, కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, రిటైర్డ్ జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, రిటైర్డ్ బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, వయోవృద్ధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చందా డబ్బుల లొల్లిలో టీబీజీకేఎస్‌ను ఆదుకున్నది ఏఐటీయూసీనే

- 11 ఏళ్ల పాలనలో కార్మికుల హక్కులను కాలరాశారు.. ఇప్పుడు విమర్శలు సరికాదు.
- 31 డిమాండ్లతో సమ్మె నోటీసు.. 24 డిమాండ్లపై ఒప్పందం చేసుకున్నాం.
- సింగరేణి పరిరక్షణకు ఎర్రజెండా నిరంతర పోరాటం: మడ్డి ఎల్లా గౌడ్.

**జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 1:**

సింగరేణిలో చందా డబ్బుల విషయంలో వివాదాలు ఎదుర్కొని, యాజమాన్యం వద్ద గుర్తింపు కోసం రెండు వర్గాలుగా చీలిపోయిన టీబీజీకేఎస్.. ఎన్నికల సమయంలో ఎర్రజెండా ఏఐటీయూసీ మద్దతుతోనే గుర్తింపు పొందిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అన్నారు. ఏఐటీయూసీపై టీబీజీకేఎస్ నాయకులు విమర్శలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. సింగరేణిలో 11 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న టీబీజీకేఎస్ ఒక్క అగ్రిమెంట్‌ను కూడా సక్రమంగా చేయలేదని ఆయన విమర్శించారు. కార్మికుల హక్కులను తాకట్టు పెట్టినందుకే కార్మికులు టీబీజీకేఎస్‌ను తిరస్కరించి ఏఐటీయూసీకి గుర్తింపు ఇచ్చారని తెలిపారు. సింగరేణి కార్మికులు ప్రస్తుతం అనుభవిస్తున్న హక్కుల్లో అనేకం ఏఐటీయూసీ చేసిన



పోరాటాలు, ఉద్యమాలు, సమ్మెల ఫలితంగానే సాధించుకున్నవేనని అన్నారు. ఏఐటీయూసీ ఏడోసారి గుర్తింపు సంఘంగా గెలిచిన అనంతరం కార్మికుల సమస్యలపై పోరాడి రెండు కొత్త బ్లాకులను సాధించుకున్నామని మడ్డి ఎల్లా గౌడ్ తెలిపారు. అయితే టీబీజీకేఎస్ తన 11 ఏళ్ల పాలనలో ఎన్ని కొత్త బ్లాకులు తీసుకొచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే 25 కొత్త గనులు, 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని, ఒక్క కొత్త గనిని కూడా ఎందుకు తీసుకురాలేదని నిలదీశారు. యాజమాన్యంతో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుపై ఏఐటీయూసీ నిలదీసిందన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చామని, అనంతరం ఆగస్టు 27న 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరిందని తెలిపారు. దీనికి సంబంధించిన సర్క్యులర్లు త్వరలో వెలువడనున్నాయని చెప్పారు.

### సింగరేణి ఆర్థిక సంక్షోభానికి గత ప్రభుత్వ విధానాలే కారణం

2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాజకీయ జోక్యంతో సింగరేణికి రూ.26 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని మడ్డి ఎల్లా గౌడ్ ఆరోపించారు. అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ బకాయిలను ఎందుకు ఇప్పించలేకపోయారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ విధానాల కారణంగానే సింగరేణి ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందని, ప్రస్తుతం పనిముట్లు, భద్రతా సామగ్రి కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాలను కొనసాగిస్తోందని ఆరోపించారు. సింగరేణి పరిరక్షణతో పాటు కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ ఎర్రజెండా నిరంతరం పోరాటం చేస్తుందని మడ్డి ఎల్లా గౌడ్ స్పష్టం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడిన టీబీజీకేఎస్ నాయకులు ఏఐటీయూసీపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

# చికిత్సకు రూ.1.25 లక్షల ఎల్‌ఓసీ మంజూరు

**అనారోగ్యంతో బాధపడుతున్న గట్టయ్యకు మంత్రి శ్రీధర్‌బాబు భరోసా.**

**జనం వాయిస్, ముత్తారం, అక్టోబర్ 1:**



అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంథని నియోజకవర్గం ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన మండల గట్టయ్యకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అండగా నిలిచారు. వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.1,25,000 విలువైన ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. మంత్రి చొరవతో మంజూరైన ఎల్‌ఓసీని హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆసుపత్రి సహాయకులు గట్టయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించడంతో గట్టయ్య కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

### పేదల వైద్యానికి భరోసా..

అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందే వైద్య సహాయాన్ని అందించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు చొరవ చూపుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.

# విద్యార్థిని చదువుకు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆర్థిక చేయూత

**రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత**

**జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 1:**

పై చదువులు కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆర్థిక చేయూత అందించారు. ఆటో యూనియన్ జేఏసీ నాయకుడు ఎస్.కె. జబ్బార్ కుమార్తె పై చదువుల కోసం ఆర్థిక సహాయం అవసరమని ఆటో సేవా సమితి అధ్యక్షుడు కడార్ల శ్రీధర్ హరీష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయంపై స్పందించిన వ్యాల్ల హరీష్ రెడ్డి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోలాడి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని ఎస్.కె. జబ్బార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పోలాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వ్యాల్ల హరీష్ రెడ్డి నిస్వార్థంగా నిరుపేదలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో రామగుండం ప్రాంతానికి ఎమ్మెల్యేగా సేవలందిస్తూ నిరుపేదలు, యువతకు మరింత అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చౌరస్తా-2 ఆటో యూనియన్ అధ్యక్షులు ఎం.డి. అన్ను, ఆటో జేఏసీ ఇన్‌చార్జ్ మడిపెద్ది రమేష్, నారుమళ్ల రమేష్, బండి రాజు, మామిడి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారి స్నిగ్ధకు కంటి చూపు భరోసా

**లక్ష రూపాయల విలువైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించిన డాక్టర్ శ్రీధర్.**
**సమతా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ దుర్గం నగేష్ అభినందనలు.**

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 1:**

నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి కంటి చూపు సమస్యకు స్పందించి, హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో సుమారు రూ.లక్ష విలువైన వైద్య చికిత్సను ఉచితంగా అందించేందుకు సహకరించిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండా శ్రీధర్ మానవతా దృక్పథాన్ని సమతా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ దుర్గం నగేష్ అభినందించారు. గురువారం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో డాక్టర్ శ్రీధర్‌ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ పరిధిలోని అన్నపూర్ణ కాలనీకి చెందిన ఇంజపురి స్నిగ్ధ (11) కొంతకాలంగా కంటి చూపు మందగించే సమస్యతో బాధపడుతోంది. భర్త లేకపోవడంతో రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్న తల్లి సిరీషకు కుమార్తెకు మెరుగైన వైద్యం అందించడం భారంగా మారింది. ఈ విషయాన్ని సమతా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ దుర్గం నగేష్ దృష్టికి తీసుకురాగా, ఆయన చిన్నారి పరిస్థితిని డాక్టర్ శ్రీధర్‌కు వివరించారు. చిన్నారి పరిస్థితిపై స్పందించిన డాక్టర్ శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో అవసరమైన వైద్య చికిత్సను ఉచితంగా అందేలా సహకరించారు. సుమారు రూ.లక్ష వరకు ఖర్చయ్యే వైద్యం ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అందడంతో చిన్నారి కుటుంబానికి ఊరట లభించింది. చికిత్స విజయవంతం కావడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి, అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ శ్రీధర్ చూపుతున్న చొరవ అభినందనీయమని డాక్టర్ దుర్గం నగేష్ అన్నారు. వృత్తి ధర్మంతో పాటు మానవతా దృక్పథంతో సేవలు అందిస్తున్న వైద్యులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షిస్తూ డాక్టర్ శ్రీధర్‌కు సమతా ఫౌండేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. నగేష్ తో పాటు సమత ఫౌండేషన్ సభ్యుడు రామటెంకి విశ్వనాథ ప్రతాప్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



దైనిక్ జనంవాయిస్
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి

# అక్టోబరు 2న నిరసన.

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 1:**




జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు అక్టోబరు 2న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'డిమాండ్స్ డే'లో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు టీయూడబ్ల్యూజే ఐజెయు జిల్లా అధ్యక్షుడు మల్లవర్జుల వంశీ విద్యానంద్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పెద్దపల్లిలోని గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కర్ణాటకలోని బెంగళూరులో ఇటీవల జరిగిన ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు నిరసనకు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక కేంద్ర చట్టం తీసుకురావాలని, ప్రస్తుత మీడియా పరిస్థితులపై సమగ్ర సమీక్ష కోసం కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.1955 నాటి వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టం, 1958 నాటి వేతనాల చట్టాల స్థానంలో కొత్త లేబర్ కోడ్‌లు రావడంతో జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, చట్టబద్ధమైన పని పరిస్థితులు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలు బలహీనపడ్డాయని పేర్కొన్నారు. జర్నలిస్టులకు గతంలో ఉన్న ప్రత్యేక చట్టపరమైన రక్షణలను పునరుద్ధరించాలని కోరారు. మజితియా వేతన మండలి ఏర్పాటై దాదాపు రెండు దశాబ్దాలు కావడంతో పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సిబ్బందికి వర్తించేలా కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. యూనియన్ జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ప్రతినిధులు, సభ్యులు అధిక సంఖ్యలో హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# సమగ్ర అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలి

## ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 1:**

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పేదలకు ఇంటి పట్టాల పంపిణీ తదితర అంశాలపై రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. ప్రజల నుంచి వస్తున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పేదలకు ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జల్ద అరుణ శ్రీ, మేయర్ మహంకాళి స్వామి, ఆర్డీఓ, ఎంపీడీఓ, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మజీద్ కుటుంబానికి డీఎస్ రెడ్యానాయక్ పరామర్శ

**మహబూబాబాద్, అక్టోబర్ 1 (జనం వాయిస్):**

మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజికి చెందిన మాజీ మండల కోఆప్షన్ సభ్యులు మొహమ్మద్ అబ్దుల్ మజీద్ కుమార్తె మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ గురువారం మజీద్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మజీద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుమార్తె మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దల్‌సింగ్, అమృ నాయక్ తదితరులు పాల్గొని మజీద్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



## తిరుమలాపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### సర్పంచ్ కనకటి అచ్చమ్మ

**కురవి, అక్టోబర్ 1 (జనం వాయిస్):**

తిరుమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కనకటి అచ్చమ్మ చేతుల మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీతాంజలి, జీపీఓ విజయరెడ్డి, ఉప సర్పంచ్ పూల శ్రీనివాస్, 8వ వార్డు సభ్యులు బొమ్మగాని నారాయణ, రేషన్ డీలర్, పలువురు గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# వృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వాలకు డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి.
- వృద్ధులకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలి.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించాలి.
- పింఛన్లు, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయాలి.

**జనం వాయిస్, ఘట్‌కేసర్, అక్టోబర్ 1:**

వృద్ధుల హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ కోరారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్‌లో డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు రాసకట్ల పోశం, బంగారి మల్లయ్య, ఎం. సత్యనారాయణలను శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేశారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని వేణు మాధవ్ తెలిపారు. వృద్ధుల సంక్షేమం, హక్కులు, ఆరోగ్యం, సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనంపై అవగాహన కల్పించడమే ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. వృద్ధులు తమ జీవితమంతా కుటుంబ అభివృద్ధికి, సమాజ నిర్మాణానికి, దేశ ప్రగతికి సేవలు అందించారని, వారి అనుభవం, జ్ఞానం భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వృద్ధులకు సరిపడా పింఛన్ అందించడంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య సేవలు, అవసరమైన మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆసుపత్రులు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో వృద్ధులకు ప్రాధాన్యత కల్పించాలని, ప్రజా రవాణా, రైల్వే స్టేషన్లు, ఇతర ప్రజా ప్రదేశాల్లో వృద్ధులకు అనుకూలమైన సౌకర్యాలను విస్తరించాలని సూచించారు. వృద్ధుల ఆస్తులను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం, వేధింపులు, నిర్లక్ష్యాన్ని అరికట్టేందుకు చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. ప్రస్తుతం అనేక మంది వృద్ధులు ఒంటరితనం, కుటుంబ నిర్లక్ష్యం, ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు వృద్ధుల పట్ల బాధ్యతగా వ్యవహరించి, వారి అభిప్రాయాలను గౌరవిస్తూ కుటుంబ నిర్ణయాల్లో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. వృద్ధులు సమాజానికి భారం కాదని, అపారమైన జీవితానుభవం కలిగిన మార్గదర్శకులని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాసకట్ల పోశం, ఎం. సత్యనారాయణ, బంగారి మల్లయ్య, ఎస్. లక్ష్మీనారాయణ, ఎం. రాజా నర్సు, చుక్కల నర్సయ్య, టి. శ్రీనివాస్, ఏ. ప్రభాకర్, ప్రతాప్ సింగ్, రవీందర్, ఎం.డి. రఫిక్ అహ్మద్, వంగ రవీందర్ రెడ్డి, బి. ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.






# మంథని కమ్యూనిటీ కిచెన్ విజయవంతంగా నెల రోజుల ప్రస్థానం

**17 వేల మందికి ఉదయాన్నే పోషకాహార భోజనం..!**
**334 విద్యాసంస్థలకు నిత్యం అల్పాహారం.**
**విద్యార్థుల హాజరులో 15 శాతం పెరుగుదల.**

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 1:**

విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ఏకాగ్రత, పాఠశాలల హాజరును పెంచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం మంథని ప్రాంతంలో విజయవంతంగా కొనసాగుతోంది. మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నెల రోజులకుపైగా నిరంతరాయంగా సేవలందిస్తూ వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహార అల్పాహారాన్ని అందిస్తోంది.

### 2026 ఆగస్టు 24న ప్రారంభం

పెద్దపల్లి జిల్లా మంథనిలో తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోని షెడ్‌లో ఈ కేంద్రీకృత వంటశాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగస్టు 24న దీనిని ప్రారంభించారు. అప్పటి నుంచి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజూ అల్పాహారం తయారు చేసి ప్రత్యేక వాహనాల ద్వారా విద్యాసంస్థలకు సకాలంలో తరలిస్తున్నారు.

### 17,244 మంది విద్యార్థులకు అల్పాహారం

మంథని సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా పెద్దపల్లి జిల్లాలోని 8 మండలాల్లో 325 ప్రభుత్వ పాఠశాలలు, 9 జూనియర్ కళాశాలలు కలిపి మొత్తం 334 విద్యాసంస్థలకు ప్రతిరోజూ అల్పాహారం సరఫరా చేస్తున్నారు. మొత్తం 17,244 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు.




### హాజరులో 15 శాతం పెరుగుదల

స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం అమలుతో విద్యార్థుల హాజరులో సానుకూల మార్పు కనిపిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఉదయాన్నే పోషకాహార అల్పాహారం అందుబాటులో ఉండటంతో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరవుతున్నారని, సగటు హాజరు దాదాపు 15 శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల్లో ఉత్సాహం, తరగతులపై ఆసక్తి, ఏకాగ్రత కూడా పెరుగుతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

### మండలాల వారీగా విద్యార్థుల సంఖ్య

– పెద్దపల్లి –4,896,– మంథని ––1,899 – ఓదెల –1,605 – శ్రీరాంపూర్ –1,828 – కమాన్‌పూర్ –1,231 – ముత్తారం –1,231 – రామగిరి –1,872 – సుల్తానాబాద్ –2,682 మొత్తం – 17,244 మంది విద్యార్థులు

### వారానికి ఆరు రకాల అల్పాహారం

విద్యార్థులకు ప్రతిరోజూ ఒకే రకమైన ఆహారం కాకుండా వైవిధ్యమైన మెనూను అందిస్తున్నారు. ఇడ్లీ–సాంబార్, పూరీ–ఆలూ కుర్మా, దోస–చట్నీ, ఉప్మా–చట్నీ, మిల్లెట్ ఇడ్లీ–సాంబార్, బోండా–చట్నీ వంటి ఆహార పదార్థాలను వారంలో వివిధ రోజుల్లో అందిస్తున్నారు.



### పరిశుభ్రతకు ప్రాధాన్యం

భారీ స్థాయిలో అల్పాహారం తయారీ, ప్యాకింగ్, పంపిణీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహిస్తున్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ఆహారాన్ని సిద్ధం చేసి, విద్యార్థులు పాఠశాలలకు చేరుకునే సమయానికి ముందుగానే అల్పాహారం అందేలా పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నారు.

### హరే కృష్ణ మూవ్‌మెంట్ భాగస్వామ్యం

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, పోషక స్థితి మెరుగుపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోంది. నెల రోజుల ప్రస్థానంలోనే వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందిస్తూ మంథని సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ తన సేవలను కొనసాగిస్తోంది. 334 విద్యాసంస్థలకు నిరంతర సరఫరా, 17,244 మంది విద్యార్థులకు ప్రయోజనం, హాజరులో 15 శాతం పెరుగుదల ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన మార్పులను ప్రతిబింబిస్తున్నాయి.

# విద్యార్థుల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో ముఖ్యం

## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 1:**

విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి నాణ్యమైన పౌష్టికాహారం ఎంతో అవసరమని రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. గురువారం రామగుండంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించిన ఎమ్మెల్యే వారితో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. పౌష్టికాహారం విద్యార్థుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, పాఠశాలల్లో హాజరు శాతం పెంపునకు, విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఉత్సాహంగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీ, మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# మంథని ఆటో అసోసియేషన్ అధ్యక్షుడిగా గడిపెల్లి శీను

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 1:**

మంథని ఆటో అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో గడిపెల్లి శీను ఘన విజయం సాధించారు. అధ్యక్ష పదవికి గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రత్యర్థి ఎం.డి. ఏజాజ్ పై 51 ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. ఫలితాలు వెలువడిన వెంటనే ఆటో కార్మికులు, అసోసియేషన్ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. పూలమాలలు వేసి శీనును ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం గడిపెల్లి శీను మాట్లాడుతూ.. తనను నమ్మి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, అసోసియేషన్ సభ్యుల సంక్షేమం, ఐక్యత కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం మంథని పట్టణంలోని పురవీధుల గుండా ఆటో కార్మికులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. శీను ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు



# మంథనిలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై అవగాహన సదస్సు

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 1:**

మంథని సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన సేవా సేతు క్యాంపులో టీజీఎన్‌పీడీసీఎల్ డిస్కం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోలార్ వెండర్స్ అయిన వారాహి ఎనర్జీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొని ప్రజలకు పథకం వివరాలను వివరించారు. గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు విధానం, దరఖాస్తు ప్రక్రియ, రుణ సౌకర్యం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్ర గురించి ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్తును ప్రోత్సహించి విద్యుత్ పొదుపులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారాహి ఎనర్జీస్ సేల్స్ మేనేజర్లు బడికెల సతీష్, కొండ వెంకటేష్, అట్టెం రవి, బిరుదు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



PRGI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనంవాయిస్
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మహబూబాబాద్, అక్టోబర్ 1 (జనం వాయిస్):**

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సంక్షేమ, మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే మురళీ నాయక్ దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరిష్‌తో కలిసి అంగన్‌వాడీ చిన్నారుల కోసం నిర్వహించిన 'తొలిముద్ద' కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు స్వయంగా ఆహారం అందించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవాలు, సూచనలు సమాజ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. వృద్ధుల హక్కులకు చట్టపరమైన రక్షణ ఉన్నప్పటికీ కుటుంబ సభ్యుల మానవీయ విలువలే వారికి నిజమైన భద్రత, ఆనందాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన



వాతావరణంలో సంతోషంగా జీవించాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధులను కంటికి రెప్పలా చూసుకోవడం కుటుంబ సభ్యుల ప్రాథమిక బాధ్యత అన్నారు. ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. తన జీవితంలో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకుని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. పిల్లలకు మానవీయ విలువలు నేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా కేంద్రంలో వయోవృద్ధుల కోసం ప్రత్యేక స్థలం కేటాయించి భవనం నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ సమాజానికి సేవలందించిన





పెద్దలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమన్నారు. వృద్ధులకు అవసరమైన ఆరోగ్య సేవలు, పింఛన్లు, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సీనియర్ సిటిజన్ల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫేక్ కాల్స్, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో వచ్చే బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూధన రాజు, జిల్లా సంక్షేమ అధికారిణి శిరీష, సిబ్బంది రాజు, హరీష్, బిక్షపతి, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తయ్య, జనరల్ సెక్రటరీ రామారావు, రామిరెడ్డి, ఉపేందర్, రవీందర్ గుప్తా, అధికారులు, సీనియర్ సిటిజన్లు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విజయ డైరీని ప్రమోట్ చెయ్యాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, అక్టోబర్ 1 (జనం వాయిస్):**

జిల్లాలో విజయ డైరీని ప్రమోట్ చెయ్యాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇంచార్జీ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, విజయ డైరీ ఉప సంచాలకులు జి. ధన్ రాజ్ , జిల్లా సహకార శాఖ అధికారి, రైతులు, సర్పంచ్ లు, డైరీ రైతులు, బ్యాంకర్స్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విజయ డైరీ ని ప్రమోట్ చేయడం కోసం జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత వారితో ఒక కమిటీని వేసి గ్రామసభ నిర్వహించి జిల్లాలోని పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు



(యాక్షన్ ప్లాన్ ) సిద్ధం చేసి వెంటనే ఇవ్వాలని, ఎక్కువ పాల దిగుబడి ఉన్నచోట విజయ డైరీ కలెక్షన్ పాయింట్స్ ను ఏర్పాటు చేసి వాహనాలను సిద్ధం చేసుకోవాలని అన్నారు, సహకార సంఘాల ద్వారా కొత్తగా సొసైటీలను ఏర్పాటు చేయాలని సూచించారు, విజయ డైరీ ప్రభుత్వ రంగ సంస్థ కాబట్టి ఎలాంటి మోసాలు ఉండవని రైతులకు సౌకర్యాలు ఉంటాయని, ప్రభుత్వ సబ్సిడీలు, బ్యాంకు రుణాలు పరిశ్రమల ద్వారా సదుపాయాలను కల్పించడం జరుగుతుందని, పశు సంపదకు ఇన్సూరెన్స్ కూడా అవకాశం ఉంటుందని, పీఎంవిబి, విబిజి రాంజీ పథకం ద్వారా పాడి పరిశ్రమల అభివృద్ధి కోసం వచ్చే బ్యాంకు రుణాలను అందించాలని తెలిపారు. పాడి రైతుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని గిట్టుబాటు ధరతో పాటు తదితర సౌకర్యాలను అందించడం జరుగుతుందన్నారు, పాడి రైతులకు నాణ్యమైన పశుదానా తక్కువ ధరకు అందించడం జరుగుతుందని, సబ్సిడీపై క్యాల్షియం మినరల్ మెచ్యూర్, నటల నివారణ మందులు, గడ్డి విత్తనాలు అందించడం, విజయ పాడి రైతులకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ద్వారా పాడి పశువుల కొనుగోళ్లకు అవసరమైన రుణ సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో శ్రీమన్నారాయణ రెడ్డి, పాడి పరిశ్రమ యువ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు కల్పించి ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి

- రవీంద్రభారతి వద్ద నిరుద్యోగ కళాకారుల ఆందోళన.
- ఉద్యమ కళాకారుడు మిద్దెపాక మధుకర్.

**జనం వాయిస్,శాయంపేట,అక్టోబరు 1:**

తెలంగాణ ఉద్యమంలో కళల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని శాయంపేట మండల అధ్యక్షుడు మిద్దెపాక మధుకర్ కోరారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇనుముల రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతి ముట్టడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర సాధన కోసం తమ కళను అంకితం చేసి ఉద్యమంలో కీలక పాత్ర పోషించినా.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పలువురు కళాకారులు నిరుద్యోగులుగానే ఉన్నారని మధుకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో తమతో కలిసి పనిచేసిన కొందరికి ఉద్యోగాలు దక్కాయని, మిగిలిన కళాకారుల అర్హతలు, ఉద్యమ సేవలను పరిగణనలోకి తీసుకుని ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఆగస్టియన్ సురేందర్, కాజీపేట ఇన్‌చార్జి అమ్మకుమార్, ధర్మసాగర్ ఇన్‌చార్జి జోగు రాజు, వేలేరు ఇన్‌చార్జి కొయ్యడ రాజమౌళి, ఎల్కతుర్తి ఇన్‌చార్జి మధుచారి, కమలాపూర్ ఇన్‌చార్జి బండారి సుధాకర్, పరకాల ఇన్‌చార్జి ఇనుముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# పాలకుర్తిలో ప్రారంభమైన బొడ్డెమ్మ వేడుకలు





**పాలకుర్తి, అక్టోబర్ 1 జనం వాయిస్:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బొడ్డెమ్మ వేడుకలు పాలకుర్తిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు, బాలికలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బొడ్డెమ్మను అందంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బొడ్డెమ్మ చుట్టూ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సందడి నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి పట్ల గౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ సంప్రదాయ వేడుకలను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని మహిళలు తెలిపారు. బొడ్డెమ్మ వేడుకలు గ్రామ ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపాయి. ఈ కార్యక్రమాలలో నంగునూరు పద్మ భూలక్ష్మి నీలిమ పన్నీర్ ఉమా ఎలేంద్ర ప్రియాంక ఝాన్సీ విజయ ధనలక్ష్మి లలిత స్వాతి స్వరూప రమ పాల్గొన్నారు.



# 39 మందికి రూ.39.04 లక్షల చెక్కులు

**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 1:**

అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శాయంపేట రైతువేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 39 మంది లబ్ధిదారులకు రూ.39,04,524 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్. ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో ఫణిచంద్ర, ఏవో మార్క ప్రియదర్శిని, ఎమ్మార్ఐ అజ్మీర చిమన్ నాయక్, ఏఆర్ఐ రమేష్ జిపిఓ నరేష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, చల్ల చక్రపాణి,చిందం రవి, వైనాల కుమారస్వామి, శాయంపేట గ్రామ సర్పంచ్ ఉమా-రవిపాల్, దుబాసి కృష్ణమూర్తి, సర్పంచులు గజ్జి ఐలయ్య, మంద దీన-ప్రభాకర్, కుక్కల తిరుపతి పాల్గొన్నారు.




# గ్రామ పంచాయతీల అభివృద్ధి, నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎంపీడీఓ

**అక్టోబర్ 1 జనం వాయిస్ పాలకుర్తి:**

తీగారం మరియు పాలకుర్తి గ్రామ పంచాయతీలలో గురువారం నిర్వహించిన గ్రామసభలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి ఎంపీడీఓ మాట్లాడారు.

ప్రకటన ముఖ్యాంశాలు:

ఎల్ నినో ప్రభావం – నీటి సంరక్షణ చర్యలు: ఎల్ నినో సంవత్సరంలో ఎదురయ్యే పరిస్థితులు, తీవ్రతను వివరించిన ఎంపీడీఓ, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గ్రామాల్లో భూగర్భ జలమట్టాలను పెంచేందుకు బోర్వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లు, ఫామ్ పాండ్స్ (పంటకుంటలు), ఊట కుంటలు, ఫిష్ పాండ్స్, ఇంకుడు గుంతలు (సోక్ పిట్స్) వంటి పనులను అధికంగా గుర్తించి, వెంటనే గ్రామసభ తీర్మానాలు ఆమోదించాలని కోరారు. ఉపాధి హామీ – లేబర్ రిపోర్ట్ పెంపు: గ్రామంలో లేబర్ రిపోర్ట్ ఎంత మెరుగ్గా ఉంటే, గ్రామానికి లభించే మెటీరియల్ కాంపోనెంట్ ఫండ్స్ అంత ఎక్కువగా వస్తాయని స్పష్టం చేశారు. గ్రామంలో శాశ్వత ఆస్తుల కల్పన పెరగాలంటే కూలీల సంఖ్య, క్షేత్రస్థాయి హాజరు పెరగాలని, ఉపాధి హామీ పనులలో లేబర్ రిపోర్ట్‌ను తక్షణమే మెరుగుపరచాలని సూచించారు. వికసిత్ గ్రామీణ్ పంచాయత్ ప్లానింగ్ : భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. ఊరి సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అవసరాలను పక్కాగా గుర్తించి, వీజీపీపీ ప్రణాళికను సమర్థవంతంగా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ గ్రామసభలలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

## కురవి ఎస్సై బి. సతీష్

**కురవి, అక్టోబర్ 1 (జనం వాయిస్) :**



కురవి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 5 లీటర్ల కాచిన సారాను స్వాధీనం చేసుకున్నారు. కురవి ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కురవి ఎస్ఐ వి. జయకుమార్ సిబ్బంది పీసీ1787, పీసీ 3717, డబ్ల్యూపీసీ 1773లతో కలిసి లింగ్యా తండా (బలపాల) గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో లింగ్యా తండాకు చెందిన మాలోత్ వీరన్న (40), తండ్రి సోమ్లా, వ్యవసాయ వృత్తి చేస్తున్న వ్యక్తి, నాటు సారా విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు రూ.2,000 విలువైన 5 లీటర్ల కాచిన సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితుడిపై సిఆర్. నెం.198/2026, టిఎస్ పిఎ యాక్ట్ సెక్షన్ 7(ఎ) ఆర్/డబ్ల్యూ 8(ఇ) కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

# లింగ్యా తండాలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

**కురవి, అక్టోబర్ 1 (జనం వాయిస్):**



లింగ్యా తండా (బి)లో విద్యుత్ స్తంభాల సమస్యకు పరిష్కారం చూపేందుకు సర్పంచ్ మాలోతు స్వరూప--హరిలాల్ నాయక్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. తండా ప్రజలు విద్యుత్ స్తంభాల కొరతతో ఇబ్బందులు పడకుండా అవసరమైన స్తంభాలను తెప్పించి, ప్రతి వార్డులోని గల్లీ గల్లీకి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. తండాలోని ప్రతి కుటుంబానికి మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించాలనే లక్ష్యంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తండా అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ మాలోతు స్వరూప--హరిలాల్ నాయక్‌కు తండా ప్రజలు అభినందనలు తెలిపారు.

# రైతుల కరెంటుపై బీజేపీ పోరు

- కోతలు ఆపి 24 గంటల సరఫరా ఇవ్వాలి
- నరహరిశెట్టి రామకృష్ణ

**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 1:**

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం శాయంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యుత్ కోతలతో సాగుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, హామీ మేరకు నిరంతర విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి మాట్లాడుతూ.. రైతుల సాగుకు నిరంతర విద్యుత్ కీలకమన్నారు. కోతలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పు రాజు, కానుగుల నాగరాజు, గడ్డం రమేష్, మోత్కూరు సత్యనారాయణ, కడారి చంద్రమౌళి, బూర ఈశ్వరయ్య, భూతం తిరుపతి, రాజశేఖర్, మేకల సుమన్, కన్నెబోయిన రమేష్, పున్నం సాంబయ్య, వనం దేవరాజ్, కోడెపాక సంజీవరావు,బత్తుల రవి, ఉప్పునూతల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# ఫేక్ కొడుకు.. సాధువుగా ఎంట్రీ..!

**జనం వాయిస్, రంగారెడ్డి , అక్టోబరు 1:**

24 ఏళ్లుగా కొడుకు కోసం ఎదురుచూస్తున్న ఆ తండ్రికి.. ఒక్కసారిగా తన కొడుకు కళ్లముందు కనిపించాడు. సాధువు వేషంలో ప్రత్యక్షమైన వ్యక్తిని 'నీ కొడుకే' అంటూ పరిచయం చేయడంతో ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. కానీ ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. 8 ఎకరాల భూమిని టార్గెట్ చేసి.. రూ.40 లక్షలు వసూలు చేసేందుకు వేసిన ప్లాన్.. డిఎన్ఏ టెస్ట్ మాటతో బట్టబయలైంది.

### 24 ఏళ్లుగా కొడుకు కోసం ఎదురుచూపులు..

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం సీతారాంపేటకు చెందిన పిషపాటి లక్ష్మారెడ్డికి ఐదుగురు కూతుళ్ల తర్వాత ఒక్కగానొక్క కొడుకు శ్రీనివాస్‌రెడ్డి. 2002లో టెన్త్‌లో ఫెయిల్ కావడంతో తండ్రి మందలించగా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతడి ఆచూకీ తెలియలేదు. కొడుకు తిరిగి వస్తాడనే ఆశతో తండ్రి 24 ఏళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నాడు.

### ఫేక్ కొడుకు.. సాధువుగా ఎంట్రీ ..

ఈ విషయం తెలుసుకున్న మోహన్‌రెడ్డి అనే వ్యక్తి సెప్టెంబర్ 16న లక్ష్మారెడ్డికి పరిచయమయ్యాడు. 'నీ వారసుడు వచ్చాడు' అంటూ నమ్మబలికాడు. సెప్టెంబర్ 20న చెరువుగట్టు గుడి వద్దకు తీసుకెళ్లి.. మాల వేసుకుని సాధువు వేషంలో ఉన్న నకిరేకల్‌కు చెందిన యాదయ్యను చూపించాడు. 'ఇతడే నీ కొడుకు శ్రీనివాస్‌రెడ్డి' అంటూ పరిచయం చేశాడు. దీంతో 24 ఏళ్ల నిరీక్షణకు తెరపడిందని లక్ష్మారెడ్డి భావించాడు. యాదయ్య కూడా ఫోన్‌లో 'నాన్నా.. నాకు పెళ్లయింది.. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు' అంటూ మాట్లాడటంతో తండ్రి పూర్తిగా నమ్మాడు.

### 8 ఎకరాల పొలం కోసం.. టార్గెట్!

కొడుకు తిరిగొచ్చాడన్న ఆనందంతో ఉన్న లక్ష్మారెడ్డి కుటుంబాన్ని.. ఆస్తి వ్యవహారంలోకి లాగేందుకు ప్రయత్నాలు మొదలైనట్లు బాధితులు ఆరోపించారు. 8 ఎకరాల భూమిపై కన్నేసి.. నకిలీ వారసుడిని తెరపైకి తెచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### రూ.40 లక్షలు టోకరాకు ప్లాన్!

సెప్టెంబర్ 22న మోహన్‌రెడ్డి లక్ష్మారెడ్డి ఇంటికి వచ్చి.. 'నీ కొడుకు మాలలో



ఉన్నాడు.. మాల తీయించాలి.. సమ్మక్క–సారక్క జాతరకు తీసుకెళ్లాలి.. రూ.40 లక్షలు ఖర్చవుతుంది' అంటూ డబ్బులు డిమాండ్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డబ్బుల డిమాండ్‌తో కూతుళ్లకు డౌట్ వచ్చింది. వరుసగా డబ్బులు అడుగుతుండటంతో కుటుంబ సభ్యులకు అనుమానం మొదలైంది. మాటల్లోనూ, వ్యవహారంలోనూ తేడాలు కనిపించడంతో అసలు విషయం తేల్చుకోవాలని నిర్ణయించారు.

### డిఎన్ఏ టెస్ట్ మాటతో.. డొంక కదిలింది!

సెప్టెంబర్ 27న సాయంత్రం ఇబ్రహీంపట్నంలోని భరత్ గార్డెన్స్ వద్దకు యాదయ్యను రప్పించారు. 'ఇచీూ టెస్ట్ చేయిస్తాం.. అసలు నువ్వెవరో తేలిపోతుంది' అంటూ నిలదీశారు. దీంతో భయపడిన యాదయ్య చివరకు నిజం ఒప్పుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### 'మోహన్‌రెడ్డి చెప్పడంతోనే కొడుకులా నటించా'

మోహన్‌రెడ్డి చెప్పడం వల్లే డబ్బుల కోసం శ్రీనివాస్‌రెడ్డిగా నటించానని యాదయ్య అంగీకరించినట్లు బాధితులు పేర్కొన్నారు. దీంతో 24 ఏళ్ల తర్వాత కొడుకు వచ్చాడన్న కథ.. చివరకు ఫేక్ డ్రామాగా తేలింది.

### పోలీసుల దర్యాప్తు..

ఘటనపై బాధితులు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఘటన వెనుక మరెవరైనా ఉన్నారా? ఆస్తి కోసం పక్కా స్కెచ్ వేశారా? అనే కోణాల్లోనూ విచారణ కొనసాగుతోంది.




**తెలంగాణ** పల్లెల్లో పండుగ సందడి మొదలైంది. బతుకమ్మకు ముందుగా వచ్చే బొడ్డెమ్మ పండుగతో ఆడబిడ్డల ఆటపాటలు, పల్లె సంస్కృతి, ప్రకృతితో మమేకమైన సంప్రదాయాలు మరోసారి కనువిందు చేస్తున్నాయి. వర్షాకాలం ముగింపు దశలో, శరదృతువు ఆరంభానికి ముందు వచ్చే బొడ్డెమ్మ వేడుకలు తెలంగాణ పల్లె జీవనంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వ జిల్లా సమాచార వనరులు కూడా బొడ్డెమ్మను బతుకమ్మకు ముందు వచ్చే సంప్రదాయ పండుగగా పేర్కొంటున్నాయి. ?

తెలంగాణలో ప్రాంతానికో రీతిగా బొడ్డెమ్మను జరుపుకునే ఆచారాలు కనిపిస్తాయి. కొన్ని ప్రాంతాల్లో మట్టి బొడ్డెమ్మను తయారు చేసి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజిస్తారు. ముఖ్యంగా కన్నెపిల్లలు, మహిళలు సాయంత్రం వేళ ఒకచోట చేరి అందంగా అలంకరించి ఇంటి ముందు లేదా ప్రత్యేక ప్రదేశంలో ఉంచుతారు. పూలు, పసుపు, కుంకుమతో అలంకరించి గౌరమ్మను తలచుకుంటూ పూజలు నిర్వహిస్తారు. మట్టితో రూపం.. పూలతో అలంకారం.. పాటలతో పూజ అన్నట్టుగా ఈ వేడుక సాగుతుంది.

సాయంత్రం వేళ ఇంటింటి నుంచి ఆడబిడ్డలు, యువతులు, మహిళలు బొడ్డెమ్మ దగ్గరకు చేరుతారు. రంగురంగుల బట్టలు ధరించి, పూలతో అలంకరించుకొని పాటలు పాడుతూ చుట్టూ తిరుగుతారు. పెద్దవాళ్లు పాడే పాత పాటలను యువతులు, చిన్నారులు నేర్చుకోవడం ద్వారా తరతరాలుగా వస్తున్న జానపద సంపద కూడా కొనసాగుతుంది.

### ఆడబిడ్డల పండుగ.. ఆత్మీయతకు వేదిక

బొడ్డెమ్మ పండుగలో ఆడబిడ్డలే ప్రధాన ఆకర్షణ. ఒకప్పుడు పల్లెల్లో ప్రతి ఇంటి ముందు కనిపించే బొడ్డెమ్మ.. కాలం మారుతున్నా తన ప్రత్యేకతను కోల్పోలేదు. పట్టణీకరణ పెరిగినా గ్రామాల్లోని మహిళలు, యువతులు ఈ సంప్రదాయాన్ని తమదైన రీతిలో కొనసాగిస్తున్నారు. చిన్నారులను కూడా వేడుకల్లో భాగస్వాములను చేస్తూ "మన పండుగ.. మన సంస్కృతి" అనే భావనను ముందుకు తీసుకెళు న్నారు.

### ప్రకృతితో ముడిపడిన పండుగ

బొడ్డెమ్మ, బతుకమ్మ వేడుకల్లో ప్రకృతికి ఉన్న ప్రాధాన్యం విశేషం. తెలంగాణలో వర్షాకాలం చివర్లో సహజంగా విరబూసే తంగేడు, గునుగు వంటి పూలు బతుకమ్మ సంబరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండే కాలంలో ప్రకృతి కొత్త అందాలను సంతరించుకోవడం ఈ పూల పండుగలతో ముడిపడి ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వ పర్యాటక, జిల్లా అధికారిక వనరులు కూడా బతుకమ్మను భూమి, నీరు, మనిషి మధ్య అనుబంధాన్ని ప్రతిబింబించే పండుగగా వివరిస్తున్నాయి. ?

### "పోయిరావమ్మా బొడ్డెమ్మ.." అంటూ సాగనంపి..

*పండుగ ముగింపు సందర్భంగా బొడ్డెమ్మను పూలతో అలంకరించి పాటలు పాడుతూ చెరువు, కుంటల వైపు తీసుకెళ్లి నిమజ్జనం చేయడం కొన్ని ప్రాంతాల్లో ఆనవాయితీ. "పోయిరావమ్మా బొడ్డెమ్మ.." అంటూ మహిళలు, చిన్నారులు పాటలు పాడుతూ వీడ్కోలు పలుకుతారు. బొడ్డెమ్మ వేడుకలు ముగిసిన తర్వాత బతుకమ్మ సంబరాలకు రంగం సిద్ధమవుతుంది. అందుకే తెలంగాణ పల్లెల్లో బొడ్డెమ్మ నుంచి బతుకమ్మ వరకు సాగేది పూలు, పాటలు, పల్లె జీవితం, ఆడబిడ్డల ఆత్మీయత కలిసిన ప్రత్యేక సాంస్కృతిక పరంపర. ?*

# బొడ్డెమ్మతో పల్లెల్లో పూల పండుగకు శ్రీకారం

బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ పండుగను జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో స్థానిక ఆచారం ప్రకారం పండుగ రోజుల సంఖ్యలో కూడా తేడాలు కనిపిస్తాయి. ?

### మట్టితో బొడ్డెమ్మ.. మనసుతో పూజలు

బొడ్డెమ్మ తయారీలో మట్టికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. పల్లె మట్టితో బొడ్డెమ్మను తయారు చేసి పెళ్లికాని అమ్మాయిలు, మహిళలు కలిసి పండుగను నిర్వహించడం అనేక ప్రాంతాల్లో కనిపించే సంప్రదాయం. కుటుంబాల్లో శుభం, సుఖసంతోషాలు కలగాలని, మంచి జీవితం రావాలని కోరుకుంటూ బొడ్డెమ్మకు పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఆచారాలకు ప్రాంతానుసారంగా భిన్నమైన విశ్వాసాలు ఉన్నాయని గమనించాలి. ?




## జనం వాయిస్ స్పెషల్ స్టోరీ

*తెలంగాణ పల్లెలంటేనే పండుగలకు, జానపద సంప్రదాయాలకు పెట్టింది పేరు. వానాకాలం ముగిసి పచ్చదనం పరుచుకున్న వేళ.. పల్లె వాకిళ్లు పూల పరిమళంతో నిండిపోతున్నాయి. బతుకమ్మ సంబురాలకు ముందుగా వచ్చే బొడ్డెమ్మ పండుగతో తెలంగాణ పల్లెల్లో ఆడబిడ్డల సందడి మొదలైంది. మట్టి, పూలు, పసుపు, కుంకుమ, పాటలు, చప్పట్లతో బొడ్డెమ్మ వేడుకలు ఊరూరా పాత జ్ఞాపకాలను మళ్లీ కళ్లముందుకు తెస్తున్నాయి. బొడ్డెమ్మ అంటే కేవలం మట్టితో తయారు చేసే ఒక ప్రతిరూపం మాత్రమే కాదు.. తెలంగాణ పల్లె ఆడబిడ్డల మనసుల్లో తరతరాలుగా నాటుకుపోయిన ఒక ఆత్మీయమైన సంప్రదాయం. పల్లె మట్టిని చేతుల్లోకి తీసుకొని బొడ్డెమ్మను తయారు చేయడం దగ్గరి నుంచి దానికి పూలతో అలంకరణ చేయడం, సాయంత్రం వేళ చుట్టూ చేరి పాటలు పాడడం, చివరగా చెరువు లేదా కుంట వద్దకు తీసుకెళ్లి సాగనంపడం వరకు ప్రతి ఘట్టంలోనూ తెలంగాణ జీవన విధానం కనిపిస్తుంది.*



### మట్టితో రూపం.. పూలతో అలంకారం

పల్లెల్లో బొడ్డెమ్మ పండుగకు ముందుగానే ఏర్పాట్లు మొదలవుతాయి. ఇంటి ముందు వాకిళ్లను శుభ్రం చేసి ముగ్గులు వేస్తారు. పండుగ రోజు ఉదయాన్నే పల్లె మట్టిని సేకరించి సంప్రదాయ పద్ధతిలో బొడ్డెమ్మను తయారు చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో బొడ్డెమ్మను చిన్న చిన్న మట్టి ముద్దలతో మెట్ల ఆకారంలో పేర్చి, పైన గౌరమ్మను ప్రతిష్ఠించే పద్ధతి కనిపిస్తుంది. మరికొన్ని ప్రాంతాల్లో స్థానిక ఆచారాలకు అనుగుణంగా రూపంలో మార్పులు ఉంటాయి. బొడ్డెమ్మను పసుపు, కుంకుమతో అలంకరించి చుట్టూ పూలను పెడతారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలతో అలంకరించి పూజలు చేస్తారు. ఇంటిల్లిపాదీ కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబంలో సుఖసంతోషాలు ఉండాలని, పిల్లాపాపలు చల్లగా ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటారు.

### ఆడబిడ్డలే పండుగకు ప్రాణం

బొడ్డెమ్మ పండుగలో ఆడబిడ్డలదే ప్రధాన పాత్ర. సాయంత్రం కాగానే కొత్త బట్టలు కట్టుకున్న చిన్నారులు, యువతులు, మహిళలు ఒక్కొక్కరిగా బొడ్డెమ్మ ఉన్న చోటుకు చేరుతారు. కొందరు ఇంటి నుంచి పూలు తీసుకొస్తే.. మరికొందరు నైవేద్యాలు తీసుకొస్తారు. అందరూ కలిసి బొడ్డెమ్మను అందంగా అలంకరించి పూజలు చేస్తారు. ఆ తర్వాత మొదలయ్యేది అసలైన పల్లె సందడి. బొడ్డెమ్మ చుట్టూ వలయంగా నిలబడి చప్పట్లు కొడుతూ పాటలు పాడుతారు. ఒకరు పాట మొదలుపెడితే మిగిలినవారంతా గొంతు కలుపుతారు. పెద్దవాళ్లకు తెలిసిన పాత జానపద పాటలను చిన్నారులు నేర్చుకుంటారు. అలా ఒక తరం నుంచి మరో తరానికి తెలంగాణ జానపద సంస్కృతి చేరుతూనే ఉంటుంది. పాటలో పల్లె జీవితం.. చప్పట్లో ఆడబిడ్డల ఆనందం.. మట్టిలో తెలంగాణ తల్లి పరిమళం కనిపించేలా బొడ్డెమ్మ వేడుక సాగుతుంది.

### పల్లె బంధాలను కలిపే పండుగ

ఒకప్పుడు పల్లెల్లో ప్రతి ఇంటి ఆడబిడ్డకు బొడ్డెమ్మ పండుగ ఒక ప్రత్యేకమైన వేడుక. పొలాల్లో పనులు ముగించుకున్న మహిళలు సాయంత్రం ఒకచోట చేరి బొడ్డెమ్మ చుట్టూ పాటలు పాడేవారు. ఎవరి ఇంట్లో ఏ సమస్య ఉన్నా, ఎవరి ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా అందరూ కలిసి మాట్లాడుకునే అవకాశం ఈ పండుగ ద్వారా లభించేది. అందుకే బొడ్డెమ్మను పల్లె ఆడబిడ్డల ఆత్మీయతకు ప్రతీకగా కూడా చూడొచ్చు. పండుగ పేరుతో పక్కింటి వాళ్లు, బంధువులు, స్నేహితులు ఒకచోట చేరడం.. చిన్నారులు పెద్దలతో కలిసిపోవడం.. పెద్దలు తమకు తెలిసిన పాటలు, ఆచారాలను పిల్లలకు చెప్పడం.. ఇలా సామాజిక బంధాలను బలపరిచే వేదికగా కూడా బొడ్డెమ్మ నిలుస్తోంది.




### ప్రకృతితో ముడిపడిన పండుగ

బొడ్డెమ్మ పండుగలో మట్టికి, పూలకు ఉన్న ప్రాధాన్యం ప్రత్యేకమైనది. వానాకాలం తర్వాత నేల తడిసి పచ్చదనంతో కళకళలాడే సమయంలో ఈ పండుగ రావడం ప్రకృతితో ముడిపడిన తెలంగాణ జీవన విధానాన్ని గుర్తుచేస్తుంది. మట్టితో బొడ్డెమ్మను తయారు చేయడం, పూలతో అలంకరించడం, చివర్లో నీటిలో నిమజ్జనం చేయడం.. మట్టి నుంచి పుట్టి ప్రకృతిలోనే కలిసిపోయే జీవన చక్రాన్ని గుర్తుచేస్తుంది. పల్లెల్లో చెరువులు, కుంటలు, వాగులు కేవలం నీటి వనరులు మాత్రమే కాదు.. తెలంగాణ పండుగలతో కూడా వాటికి విడదీయరాని అనుబంధం ఉంది. బొడ్డెమ్మను సాగనంపే సమయంలో మహిళలు, చిన్నారులు చెరువు గట్టు వరకు వెళ్లి పాటలు పాడుతూ వీడ్కోలు పలకడం ఆ అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది.

"పోయిరావమ్మా బొడ్డెమ్మ.." అంటూ వీడ్కోలు

బొడ్డెమ్మ వేడుకల్లో చివరి ఘట్టం కూడా ఎంతో ప్రత్యేకం. పూలతో అలంకరించిన బొడ్డెమ్మను మహిళలు, ఆడబిడ్డలు కలిసి తీసుకెళ్తారు. దారంతా పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సందడి చేస్తారు. చెరువు, కుంట లేదా స్థానికంగా నిర్ణయించిన నీటి ప్రదేశానికి చేరుకున్న తర్వాత సంప్రదాయ పద్ధతిలో బొడ్డెమ్మకు వీడ్కోలు పలుకుతారు. "పోయిరావమ్మా బొడ్డెమ్మ.. మళ్లీ రావమ్మా.." అంటూ పాడే పాటల్లో ఆడబిడ్డల అనుబంధం, పల్లె సంస్కృతి ప్రతిధ్వనిస్తుంది. బొడ్డెమ్మను సాగనంపిన తర్వాత వచ్చే బతుకమ్మ సంబురాల కోసం పల్లెల్లో మరోసారి ఏర్పాట్లు మొదలవుతాయి.

### బొడ్డెమ్మ నుంచి బతుకమ్మ వరకు.. పూల పరంపర

తెలంగాణలో బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలకు ఒకదానితో ఒకటి అనుబంధం కనిపిస్తుంది. బొడ్డెమ్మతో మొదలయ్యే ఆడబిడ్డల పండుగ వాతావరణం బతుకమ్మతో మరింత వైభవంగా మారుతుంది. ఒకవైపు మట్టితో బొడ్డెమ్మ.. మరోవైపు రకరకాల పూలతో బతుకమ్మ.. రెండింటిలోనూ ప్రకృతి, మహిళలు, జానపద పాటలు, పల్లె జీవనం ప్రధానంగా కనిపిస్తాయి. కాలం మారింది. పల్లెలు పట్టణాలుగా మారుతున్నాయి. ఆధునిక జీవన విధానం పెరిగింది. అయినా తెలంగాణ పల్లెల్లో బొడ్డెమ్మ పండుగ మాత్రం తనదైన గుర్తింపును నిలబెట్టుకుంటోంది. కొన్ని ప్రాంతాల్లో ఆచారాలు మారినా.. మరికొన్ని ప్రాంతాల్లో పద్ధతులు మారినా.. మట్టితో బొడ్డెమ్మను చేసి, పూలతో అలంకరించి, ఆడబిడ్డలు ఒక్కచోట చేరి పాటలు పాడటం అనే మూల సంప్రదాయం మాత్రం కొనసాగుతూనే ఉంది.

### తరతరాలకు అందించాల్సిన పల్లె సంపద

బొడ్డెమ్మలాంటి పండుగలు తెలంగాణకు ప్రత్యేకమైన జానపద సంపద. పుస్తకాల్లో చదివే చరిత్ర కంటే.. పల్లె వాకిళ్లలో ఆచరించే సంప్రదాయాలే ఒక ప్రాంతపు సంస్కృతిని బలంగా నిలబెడతాయి. అమ్మమ్మలు, నానమ్మలు పాడిన పాటలను మనవరాళ్లు పాడటం.. పెద్దలు చెప్పిన ఆచారాలను పిల్లలు పాటించడం.. ఇదే మన సంస్కృతి తరతరాలకు చేరే మార్గం.

అందుకే బొడ్డెమ్మను కేవలం ఒక పండుగగా కాకుండా తెలంగాణ పల్లె జీవన విధానానికి అద్దం పట్టే సాంస్కృతిక వేడుకగా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఆధునికత ఎంత పెరిగినా.. మన మట్టి వాసన, మన పూల పరిమళం, మన జానపద పాటలు, మన ఆడబిడ్డల ఆత్మీయత మరువకూడదు.

*మట్టిలో పుట్టిన బొడ్డెమ్మ.. పూలతో మురిసిన బొడ్డెమ్మ.. పాటల్లో పలికిన బొడ్డెమ్మ.. చెరువు ఒడ్డున వీడ్కోలు తీసుకునే బొడ్డెమ్మ.. తెలంగాణ పల్లె గుండెల్లో మాత్రం ఎప్పటికీ బతికే ఉంటుంది. బొడ్డెమ్మ సందడితో మొదలైన పూల పండుగ.. బతుకమ్మ సంబురాలతో తెలంగాణ అంతటా మరింత వైభవంగా విరబూయనుంది.*

బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్
బిడ్డలందరే కోల్
బంగారు బొడ్డెమ్మ కోల్
బాలలందరే కోల్
చెరువుకాడ బొడ్డెమ్మ కోల్
చెట్ల నీడ బొడ్డెమ్మ కోల్
పూలతోటి బొడ్డెమ్మ కోల్
పల్లెలంతా కోల్
తంగేడు పూలు కోల్
గునుగు పూలు కోల్
బంతి పూలు కోల్
బొడ్డెమ్మకు కోల్
అమ్మలందరూ కోల్
అక్కలందరూ కోల్
చెల్లెలందరూ కోల్
చుట్టూ చేరి కోల్
పసుపు కుంకుమ కోల్
పూల పరిమళం కోల్
పల్లె పండుగ కోల్
బొడ్డెమ్మ పండుగ కోల్
బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్
బిడ్డలందరే కోల్
సల్లంగ చూడు తల్లీ కోల్
సంతోషమివ్వు కోల్


Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. PRGI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com